సాక్షి
అనంతపురం
బుధవారం ၊ 21 ၊ జూన్ ၊ 2023




## చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



## జిల్లాకు వర్ష సూచన

జిల్లాలో రానున్న మూడు రోజుల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
40.1°/24.3°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

## న్యూస్‌రీల్

### డీసెట్ ఉర్దూలో అనంత విద్యార్థినికి మొదటి ర్యాంకు



మొగల్ షీమ షాలెహ

రాప్తాడు రూరల్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీసెట్)–2023 ఉర్దూ మీడియం ప్రవేశ పరీక్షలో అనంతపురం నగరానికి చెందిన మొగల్ షీమా షాలెహ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. సోమవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో 100కు 60 మార్కులు సాధించినట్లుగా తేలింది. కాగా, షీమా తల్లిదండ్రులు అనంతపురంలోని ఆజాద్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. తండ్రి సాదిక్‌బాషా ఫుడ్ క్యాటరర్స్ నిర్వహణతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ మీడియం పదో తరగతి చదివి 10/10 పాయింట్లతో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్‌ను కేఎస్‌ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ఎంహెచ్‌సీ (ఉర్దూ మీడియం) పూర్తి చేసింది. రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన షీమాను శ్రీసత్యసాయి జిల్లా అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.అబ్దుల్‌మాలిక్, హెచ్‌ఎం రవీంద్రబాబు, ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ, ఫసులు, రెహమాన్, కలీముల్లా, ఫర్హానా, కమురున్నిసా అభినందించారు. ఈ సందర్భంగా షీమా మాట్లాడుతూ తనకు చదువులు చెప్పిన గురువుల స్ఫూర్తితో ఈ విజయాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందన్నారు.

### రాజీ మార్గమే రాజ మార్గం



మాట్లాడుతున్న శాశ్వత లోక్‌అదాలత్ ధర్మాసనం అధ్యక్షుడు శ్రీనివాసరావు

అనంతపురం: రాజీ మార్గమే రాజ మార్గమని, ఇరు పక్షాల నడుమ రాజీ కుదిరితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం అనంతపురం కోర్టు ప్రాంగణంలోని లోక్ అదాలత్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవాధికార చట్టం కింద లోక్ అదాలత్‌తో పాటు శాశ్వత లోక్‌అదాలత్ కూడా ఏర్పాటవుతుందన్నారు. ప్రజా ప్రయోజనాల సేవల కేసుల్లో తప్పనిసరిగా పరిష్కారం పొందే విధంగా శాశ్వత లోక్ అదాలత్ పనిచేస్తుందన్నారు. న్యాయ సేవాధికార చట్టంలోని సెక్షన్–22 బీ కింద శాశ్వత లోక్ అదాలత్‌లు దేశ వ్యాప్తంగా ఏర్పడ్డాయని తెలిపారు. విశ్రాంత జిల్లా న్యాయమూర్తి అధ్యక్షులుగాను, అనుభవజ్ఞులైన విశ్రాంత అధికారులు మరో ఇద్దరు సభ్యులుగాను ఉన్న ఈ శాశ్వత లోక్ అదాలత్ బెంచ్ ఫిర్యాదులను స్వీకరిస్తుందని చెప్పారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఉమ్మడిగా అనంతపురంలోని న్యాయ సేవా సదన్‌లో ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్‌అదాలత్ ఉందన్నారు. ఇందులో ఫిర్యాదు చేయడానికి ఎటువంటి కోర్టు ఫీజు, రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. శాశ్వత లోక్ అదాలత్‌కు గరిష్ట అధికార పరిమితి కోటి రూపాయలుగా నిర్ణయించామన్నారు. ఫిర్యాదు దాఖలుకు మూడు సంవత్సరాల కాల పరిమితి ఉంటుందన్నారు. ఆ లోగా దాఖలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు ఎం. రాజశేఖర్ రెడ్డి, ఎంవీఎల్ఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



నార్పలలో పరీక్షలను పరిశీలిస్తున్న జోనల్ అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి

రాప్తాడురూరల్: జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగింది. మొత్తం 77 సీట్లకు గాను 257 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 220 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జోన్–4 అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. ఫలితాల కోసం విద్యార్థులు ఎక్కడైతే పరీక్ష రాశారో అదే పాఠశాలలోని నోటీసు బోర్డులో ప్రదర్శించారు. జిల్లాలోని ఐదు పాఠశాలల ఫలితాలు జిల్లా కన్వీనర్ కార్యాలయం నార్పల బీసీ గురుకుల పాఠశాలలో ప్రదర్శించినట్లు బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ సంగీతకుమారి వెల్లడించారు.

# పుష్కలంగా ఎరువులు

### 45 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం

- రైతులు ఇబ్బంది పడకుండా ఆర్‌బీకేలు, సొసైటీల్లో నిల్వ
- ఖరీఫ్‌లో 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా లక్ష్యం



జిల్లాకు చేరిన ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)



పైరుకు ఎరువు చల్లుతున్న రైతు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో రైతులు ఇబ్బంది పడకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అందుబాటులో ఉంచాలని జగన్ సర్కారు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అందుకనుగుణంగా జిల్లా యంత్రాంగం, వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేశాయి. ఆర్‌బీకే వేదికగానే రైతులకు విస్తృత సేవలు అందించనున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, 30 శాతం రాయితీతో కందులు, పెసలు, 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ జోరుగా సాగుతోంది. అలాగే చిరుధాన్యాల సాగు పెంపునకు మినీకిట్ల రూపంలో ఉచితంగా రాగులు, కొర్రలు ఇవ్వడానికి ఏర్పాటు చేస్తున్నారు. ఎరువుల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు ఫలితాన్నిస్తున్నాయి. కీలకమైన నైరుతి రుతుపవనాలు కూడా జిల్లా అంతటా విస్తరించి వర్షాలు పడే సూచన ఉండటంతో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమయ్యారు.

**అందుబాటులో 45 వేల మెట్రిక్ టన్నులు**

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 45 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వర్షాలు వస్తే వివిధ రకాల పంటలు సాగులోకి రానుండటంతో ఎక్కడా సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. వివిధ కంపెనీల ద్వారా సరఫరా అవుతున్న ఎరువులను మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ ద్వారా ఆర్‌బీకేలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లకు ప్రాధాన్యత ఇస్తూనే ఇండెంట్ ప్రకారం హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు కూడా సరఫరా చేస్తున్నారు. అత్యవసరం కోసం కంపెనీ గోదాములు, మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్ స్టాక్ పెడుతున్నారు. అత్యధికంగా కాంప్లెక్స్ ఎరువులు 26 వేల మెట్రిక్ టన్నులు, యూరియా 9,500 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5,800 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 2,500 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 1,200 మెట్రిక్ టన్నులు, కంపోస్టు ఎరువులు 140 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఆర్‌బీకే హబ్‌ల పరిధిలో 4,600 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌ల దగ్గర 500 మెట్రిక్ టన్నులు, రీటైల్ దుకాణాల్లో 18 వేల మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్ల దగ్గర 5,300 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్‌స్టాక్ కింద 1,800 మెట్రిక్ టన్నులు, కంపెనీ గోదాముల్లో 15 వేల మెట్రిక్ టన్నుల వరకు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

### పడిగాపుల బాధ తప్పింది



నాకు ఐదెకరాల పొలం ఉంది. ఇదివరకు విత్తనాలు కావాలన్నా, ఎరువులు కావాలన్నా 15 కిలోమీటర్ల దూరంలోని శెట్టూరు మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. విత్తనాల కోసం రెండు, మూడు రోజులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి, బాధలు తప్పాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఊరిలోని ఆర్‌బీకేలోనే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నారు. ఇటీవల 9 బస్తాల సబ్సిడీ విత్తన వేరుశనగకాయలు తీసుకున్నాను. – క్రిష్టప్ప, రైతు, కనుకూరు

### పక్కాగా ఎరువుల ప్రణాళిక

ఈ ఖరీఫ్‌లో 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రణాళిక రచించి అమలు చేస్తున్నారు. అందులో అత్యధికంగా 38,690 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్‌లు, యూరియా 36,600 మెట్రిక్ టన్నులు, డీఏపీ 16,254 మెట్రిక్ టన్నులు, 9,324 మెట్రిక్ టన్నులు సింగిల్ సూపర్‌ఫాస్పేట్ (ఎస్ఎస్‌పీ), 8,370 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ), మరో 330 మెట్రిక్ టన్నుల కంపోస్టు ఎరువులు కేటాయించారు. ఇందులో ఏప్రిల్‌లో 14,252 మెట్రిక్ టన్నులు, మే నెలలో 5,979 మెట్రిక్ టన్నులు, జూన్‌లో 12,415 మెట్రిక్ టన్నులు, జూలైలో 21,031 మెట్రిక్ టన్నులు, ఆగస్టులో 28,140 మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 28,751 మెట్రిక్ టన్నులు... ఇలా నెలవారీగా వివిధ కంపెనీల నుంచి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు.

### కీర్తిశ్రీకి సీఎం సత్కారం



కీర్తిశ్రీకి అవార్డు అందజేస్తున్న సీఎం జగన్

విడపనకల్లు/బ్రహ్మసముద్రం: విడపనకల్లు మండలం పాలికి గ్రామానికి చెందిన హరిజన ధనుంజయ కుమార్తె కీర్తిశ్రీ బ్రహ్మసముద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో చదివి ఇంటర్మీడియెట్–హెచ్‌ఈసీలో 954 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. మంగళవారం విజయవాడలో జరిగిన 'జగనన్న ఆణిముత్యాలు' రాష్ట్రస్థాయి పురస్కారాల కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంది. రూ.లక్ష నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేసి మెడల్‌తో సత్కరించారు. విద్యార్థినితో పాటు అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవతమ్మను, విద్యార్థిని తల్లిదండ్రులను సీఎం అభినందించారు. తమ ఊరికి పేరుప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన కీర్తిశ్రీకి పాలికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నార్పల : జగనన్న ఆణిముత్యాలు కింద రాష్ట్రస్థాయిలో మూడోర్యాంకు సాధించిన బి.పప్పూరు బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థి మధుసూదన్‌కు అవార్డు అందజేసి, ప్రశంసించారు. విద్యార్థితో పాటు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లును సీఎం అభినందించారు.



అవార్డు అందుకుంటున్న మధుసూదన్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

# ప్రతి కూలీకి ఉపాధి చూపాలి



అప్పిలేపల్లిలో కూలీతో మాట్లాడుతున్న కలెక్టర్

కుందుర్పి/కంబదూరు: జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకీ ఉపాధి పనులను కల్పించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. మంగళవారం కుందుర్పి మండలంలో పర్యటించారు. అప్పిలేపల్లిలో ఉపాధి పనులు పరిశీలించి, కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుందుర్పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా 51 ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు రెండో విడత కింద రూ.19.28 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. కుందుర్పి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఎల్‌డీఓ శంకర్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డీఈ రాజన్న, తహసీల్దార్ విజయకుమారి తదితరులు ఉన్నారు.

**నిర్మాణాలు వేగవంతం చేయాలి**

ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. కంబదూరు మండలం రాంపురంలో రూ.61 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నయాజ్ అహ్మద్, ఎంపీడీఓ సుధాకర్‌రాజు, సూపరింటెండెంట్ ఆంజనేయులు, సర్పంచ్ చెన్నయ్య, ఎంపీటీసీ మారెన్న పాల్గొన్నారు.

**నెలాఖరులోపు నిర్మాణాలు పూర్తి కావాలి**

శెట్టూరు: నెలాఖరుకల్లా సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేసి, వచ్చే నెలలో ప్రారంభించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. మంగళవారం చెర్లోపల్లి సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

### ప్రజాహిత కార్యక్రమం 'జగనన్న సురక్ష'

అనంతపురం అర్బన్: 'జగనన్న సురక్ష' పేరుతో ప్రజాహిత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ గౌతమి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి వివరాలను మంగళవారం తెలియజేశారు. ప్రభుత్వం దాదాపు 90 శాతం గృహాలకు పలు సంక్షేమ కార్యక్రమాలు తీసుకెళ్లిందన్నారు. సంక్షేమ పథకాలు అందుకోవడానికి ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయి.. సర్టిఫికెట్లు అవసరం ఉందా తెలుసుకుని, వాటిని అధిగమించాలని ప్రభుత్వం భావించిందన్నారు. ఈ క్రమంలోనే 'జగనన్న సురక్ష' కార్యక్రమం చేపట్టిందన్నారు. ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ ధ్రువపత్రాలతో పాటు క్రయ విక్రయ మ్యుటేషన్లు, ఫోన్ నంబర్‌ను ఆధార్‌కు అనుసంధానం, కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం (సీసీఆర్‌సీ), తదితర సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తారన్నారు.

### నీవు లేని జీవితం నాకెందుకు?

- భార్య మరణం జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రవికుమార్

పెద్దవడుగూరు : కోనాపురంలో విషాదం చోటు చేసుకుంది. ప్రసవ సమయంలో భార్య, 11 రోజుల తర్వాత పసికందు మరణం అతడిని కలచివేసింది. భార్య లేని జీవితం శూన్యమనిపించింది. జీవితంపై విరక్తితో పెళ్లి రోజునే ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం మేరకు.. పెద్దవడుగూరు మండలం కోనాపురంలో నిట్టూరు రవికుమార్ (24)కు రెండేళ్ల క్రితం యాడికి మండలం చందన లక్ష్ముంపల్లికి చెందిన చంద్రకళతో వివాహమైంది. వీరి దాంపత్య జీవితం అన్యోన్యంగా సాగింది. గత నెలలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన చంద్రకళ కొద్దిసేపటికే మృతి చెందింది. 11 రోజుల తర్వాత పసికందు కూడా చనిపోయింది. దీంతో రవికుమార్ మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం పెళ్లి రోజు. గత స్మృతులను తలచుకుంటూ మౌనంగా ఉండిపోయాడు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. తర్వాత కుటుంబ సభ్యులెవరైనా రక్షిస్తారేమోనని భావించి ఉరివేసుకుని ప్రాణం తీసుకున్నాడు. నెల రోజుల వ్యవధిలోనే ముగ్గురి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

# విద్యా పథకాల అమలు మరింత పటిష్టం

- ప్రతి మండలానికీ అదనపు ఎంఈఓ
- ఉమ్మడి జిల్లాలో రెండో ఎంఈఓ పోస్టుల భర్తీ
- కౌన్సెలింగ్ ద్వారా స్థానాల కేటాయింపు



డీఈఓ కార్యాలయం

రాప్తాడురూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా పథకాలను ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ఈ పథకాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు, క్షేత్రస్థాయిలో సమర్థంగా పర్యవేక్షణ చేపట్టేందుకు ప్రతి మండలానికీ అదనంగా మండల విద్యాశాఖ అధికారిని నియమించింది. గతంలో మండలానికి ఒక ఎంఈఓ మాత్రమే ఉండేవారు. పరిపాలన, విద్యా విషయక బాధ్యతలను ఒకరే చూసుకోవాల్సి రావడంతో పర్యవేక్షణలో లోపాలు తలెత్తేవి. దీంతో రెండో ఎంఈఓ కేవలం విద్యా విషయక అంశం మీదే దృష్టి సారించేలా ఈ పోస్టులు ఏర్పాటు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు ప్రపంచస్థాయిలో రాణించాలన్నదే ముఖ్యమంత్రి ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా అత్యంత నాణ్యమైన మానవ వనరుల అభివృద్ధికి అనేక విద్యా, విద్యార్థి సంక్షేమ పథకాలను ప్రారంభించి సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. పథకాల అమలు ఉధృతి, వేగానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన రెండో ఎంఈఓ పోస్టులు ఎంతగానో ఉపయోగపడాతయని విద్యావేత్తలు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 63 మండలాల్లోనూ రెండో ఎంఈఓ పోస్టు భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ద్వారా అర్హులైన వారిని నియమించారు. వారు విధుల్లోనూ చేరిపోయారు.

### చాలా ఉపయోగకరం



రెండో ఎంఈఓ పోస్టు వల్ల చాలా ఉపయోగకరం. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ఒక ఎంఈఓ ఉండడం వల్ల అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ చూసుకోవడం ఇబ్బందిగా ఉండేది. రెండో ఎంఈఓ పూర్తిగా అకడమిక్ బాధ్యతలు చూసుకుంటారు. జిల్లాలో అన్ని మండలాల్లోనూ పోస్టులు భర్తీ చేశాం. పూర్తిస్థాయి జాబ్‌చార్ట్ రాగానే పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. – ఎం. సాయిరామ్, డీఈఓ

**కొత్త ఎంఈఓల పర్యవేక్షణ ఇలా...**

అమ్మ–ఒడి, మనబడి నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక తదితర పథకాల అమలుతో పాటు ఆంగ్లమాధ్యమం అమలు, బైజూస్ ట్యాబ్‌ల నిర్వహణ, విద్యార్థుల హాజరు, పాఠశాలల నిరంతర సందర్శన రెండో ఎంఈఓలు పర్యవేక్షిస్తారు. అలాగే పరీక్షల నిర్వహణ, ఉత్తమ ఫలితాల కోసం ప్రణాళికలు అమలు చేస్తారు.

# సమన్వయంతో పనిచేయండి



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్‌జైన్, హాజరైన ఉద్యోగులు

- సిబ్బందిని అప్రమత్తం చేయాలి
- సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి
- ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్‌జైన్

గుంతకల్లు: అధికారులు. సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ రైలు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (ఎస్‌సీఆర్–జీఎం) అరుణ్‌కుమార్‌జైన్ సూచించారు. ఇటీవల ఒడిశాలోని బాలేశ్వర్ రైల్వే స్టేషన్‌లో జరిగిన రైలు ప్రమాదం దృష్ట్యా మంగళవారం గుంతకల్లులోని రైల్వే క్లబ్‌లో సేఫ్టీ సెమినార్‌ను డివిజనల్ స్థాయి అధికారులు, ఫీల్డ్ సూపర్‌వైజర్లు, ఉద్యోగులతో నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ అధికారులు తరచూ సిబ్బంది పనితీరు, రైలు మార్గాల తనిఖీలు చేయాలని సూచించారు. కిందిస్థాయి ఉద్యోగులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ అప్రమత్తంగా ఉండేలా చూసుకునే బాధ్యత మీదేనన్నారు. చేసే పనిపై అవగాహనతో పాటు సాంకేతిక నైపుణ్యతను మెరుగుపరచుకోవాలని అన్నారు. రైలుమార్గాల నిర్వహణలో భాగంగా బ్లాక్ తీసుకున్న సమయంలో రైళ్లు ఎక్కడపడితే అక్కడ నిలబడిపోవడం, ప్రయాణికులు ఇబ్బందులకు గురికావడంతోపాటు రైల్వేకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. బ్లాక్ తీసుకునే సమయంలో ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకుని పనులు చేపడితే బాగుంటుదన్నారు. సాయంత్రం డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో డివిజన్ పరిధిలోని ట్రైన్ కంట్రోలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్, గూడ్స్‌రైళ్ల రాకపోకల సమయంలో సిగ్నల్ విషయంలో ఏమైనా సమస్యలు వస్తే సంబంధిత కంట్రోల్ ఆఫీస్‌లోని సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించి అప్రమత్తం చేయాలని జీఎం సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం కె.వెంకటరమణారెడ్డి, ఏడీఆర్‌ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీఎస్ఓ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

- స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై అనుమానాలు
- ఎక్కువశాతం సెకండ్‌హ్యాండ్‌ల్ బస్సుల వినియోగం
- నేటికీ 158 బస్సులు ఫిట్‌నెస్ టెస్టుకు రాని వైనం
- చూసీచూడనట్లుగా ఆర్టీఏ అధికారులు




ఫిట్‌నెస్ కోసం వచ్చిన స్కూల్ బస్సును పరిశీలిస్తున్న ఎంవీఐ రమణారెడ్డి

అనంతపురం సెంట్రల్: ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. రవాణా ఫీజులు రూ.వేలల్లో వసూలు చేస్తున్నా ఆ స్థాయిలో బస్సుల నిర్వహణ చూసుకోవడం లేదు. అధికారులు వీటిని తేలిగ్గా తీసుకుంటూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు సంబంధించి 730 బస్సులు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏటా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇంజిన్ కండీషన్‌తో పాటు ప్రమాదాలు జరిగిన సమయంలో విద్యార్థులు సురక్షితంగా బయటపడేందుకు అనువుగా బస్సులు ఉండాలి. కానీ జిల్లాలో ఆ ప్రమాణాలను పాటించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సెకండ్ హ్యాండిల్ బస్సులే అధికం**

రవాణా శాఖ కార్యాలయానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల (ఎఫ్‌సీ) కోసం వస్తున్న స్కూల్ బస్సుల్లో ఎక్కువ శాతం సెకండ్ హ్యాండిల్‌వే ఉంటున్నాయి. ప్రజా రవాణాకు, టూరిస్టులకు ఏళ్లతరబడి వినియోగించిన వాహనాలను తక్కువ ధరకు తెచ్చి స్కూల్ బస్సులుగా వినియోగిస్తున్నారు. వాస్తవానికి 15 సంవత్సరాల కాలపరిమితి ఉన్న బస్సులు వినియోగించుకోవచ్చు. కానీ బస్సు కండీషన్‌ను ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలి. అయితే రవాణా శాఖలో ఇంజిన్ కండీషన్ పరిశీలించి ఫిట్‌నెస్ చేసే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా ప్రతి పనికీ ఓ రేటు ఉందనే ఆరోపణలు ఉన్నాయి. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌లో కూడా అధికారులకు భారీగా ముడుపులు ముడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏజెంట్‌ల ద్వారా వచ్చిన బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) ఇచ్చి పంపుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఎఫ్‌సీకి ముందుకురాని 158 బస్సులు**

రోడ్డుపై ఏ వాహనమైనా రాకపోకలు సాగించాలంటే రవాణా శాఖ నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా ఇన్సూరెన్స్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలి. స్కూల్ బస్సుల విషయంలో ఈ నిబంధనను ప్రభుత్వం కట్టుదిట్టంగా అమలుచేస్తోంది. అయితే జిల్లాలో కొన్ని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై వారం గడిచింది. జిల్లా వ్యాప్తంగా 730 బస్సులుంటే ఇప్పటి వరకూ 572 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాయి. మిగిలిన 158 బస్సుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. ఫిట్‌నెస్ లేకుండానే విద్యార్థులతో రాకపోకలు సాగిస్తున్నాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ముఖ్యంగా గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బస్సులు తిరుగుతున్నాయి. కానీ అక్కడి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నిబంధనలు పాటించకపోతే చర్యలు

స్కూల్ బస్సుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రతి బస్సూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న వాహనాలు 158 ఉన్నట్లు గుర్తించాం. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. రెండు, మూడురోజుల్లో దాదాపు 18 బస్సులపై కేసులు నమోదు చేశాం. బస్సు కండీషన్ లేకుంటే నిరభ్యంతరంగా ఫిట్‌నెస్ తిరస్కరించాలని సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.
– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్

## క్లుప్తంగా

### మట్కా బీటర్ల అరెస్ట్



బీటర్లను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**రాయదుర్గం రూరల్:** స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా రాస్తున్న నలుగురు బీటర్లను అరెస్ట్ చేసి, రూ.1.05 లక్షలు, పెన్నులు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ లక్ష్మణ్ణ తెలిపారు. మంగళవారం సాయంత్రం మీడియా సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. రాయదుర్గంలోని నేసే పేటకు చెందిన నామదేవ్ కుమారుడు సూరే ఈరన్న, రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన కుండా ఈశ్వరప్ప కుమారుడు కుండా చిత్రయ్య, తలారి చనమల్ల కుమారుడు తలారి తిప్పేస్వామి , రామదాసు కుమారుడు మల్లికార్జున స్థానిక శనీశ్వరాలయం మిట్టపై మట్కా రాస్తూ పట్టుబడ్డారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### రైల్వే ఆస్పత్రి వైఫల్యాలపై విచారణ




సాక్షి ఎఫెక్ట్..

**గుంతకల్లు:** ఇటీవల గుంతకల్లు రైల్వే డివిజనల్ ఆస్పత్రిలో చోటు చేసుకున్న వరుస వైఫల్యాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. 'మసకబారుతున్న ప్రతిష్ట' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో వెలువడిన కథనం విదితమే. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు విచారణకు కమిటీని నియమించింది. దక్షిణ మధ్య రైల్వే లాలాగూడ మెడికల్ డైరెక్టర్ సురేంద్రనాయక్, హైదరాబాద్ - సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ ఆస్పత్రుల చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్‌లు అనురాధ, నిర్మలతో కూడిన త్రిసభ్య కమిటీ మంగళవారం గుంతకల్లుకు చేరుకుని విచారణ చేపట్టింది. ప్రధానంగా ఐదు రోజుల క్రితం గర్భ సంచి తొలగించే క్రమంలో మహిళ మూత్ర నాళాన్ని కత్తిరించిన ఘటనపై లోతైన విచారణ చేసినట్లు తెలిసింది. ఆస్పత్రి పనితీరు, ప్రస్తుత పరిస్థితిపై ఓ నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం.

# డిగ్రీ విద్యలో సమూల మార్పులు

- ఇప్పటి వరకూ మూడు కామన్ సబ్జెక్టులతో యూజీ
- ఇకపై మేజర్, మైనర్ సబ్జెక్ట్ కాంబినేషన్‌తో గ్రాడ్యుయేషన్
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి
- గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే పరిపూర్ణత సాధించేలా
- డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ



ఎస్కేయూ ముఖద్వారం

**అనంతపురం:** విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) విద్యలో సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా నూతన విద్యా ప్రణాళిక(కరిక్యులమ్)ను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకూ డిగ్రీలో మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యాబోధన సాగుతుండేది. ఇకపై మేజర్ సబ్జెక్టు ప్రధానంగా డిగ్రీ విద్య కొనసాగనుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్త విధానం అమల్లోకి వచ్చింది. ఈ మేరకు విద్యా ప్రణాళికను మార్పు చేస్తూ ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది. ఏదైనా ఒక సబ్జెక్టులో విద్యార్థులు సంపూర్ణ నైపుణ్యాలను సాధించే దిశగా విద్యా ప్రణాళికను అమలులోకి తీసుకువచ్చారు.

**మూడింట ఒక్కటే మేజర్ సబ్జెక్ట్‌గా**

గతంలో బీఎస్సీలో ఎంపీసీ తీసుకున్న విద్యార్థులకు ప్రధానంగా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులను తప్పనిసరిగా అభ్యసించాల్సి ఉండేది. ప్రస్తుతం ఆ మూడు పాఠ్యాంశాల్లో నుంచి తమకు నచ్చిన ఓ సబ్జెక్ట్‌ను మేజర్‌గా ఎంపిక చేసుకుంటే చాలు. రెండో సెమిస్టర్‌లో దాదాపు 100 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన ఓ మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. ఈ రెండు మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్య వరకు అభ్యసించేలా సమూల మార్పులు చేశారు.

**బీఎస్సీ, బీఏ, బీకామ్‌లో అమలు**

యూజీ విద్యలో మేజర్ సబ్జెక్టుతో పాటు కచ్చితంగా ఓ మైనర్ సబ్జెక్టు చదవాలి. ఉదాహరణకు ఒక సైన్స్ విద్యార్థి మైనర్ సబ్జెక్టుగా ఆర్థిక శాస్త్రం, చరిత్ర, సంగీతం, యోగా, డేటా సైన్స్ , మార్కెటింగ్.. ఇలా ఇతర ఏ సబ్జెక్ట్‌నైనా ఎంపిక చేసుకోవచ్చు. ఆర్ట్స్ విద్యార్థులు మైనర్ కోర్సుల్లో భాగంగా ఇంటర్మీడియట్ కోర్సుల ఆధారంగా తమకు నచ్చిన సబ్జెక్టు తీసుకోవచ్చు. కొత్త విధానాన్ని బీఎస్సీతో పాటు బీఏ, బీకామ్ డిగ్రీలో అమలు చేయనున్నారు. డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంతో పాటు ఇంజినీరింగ్‌తో సమానంగా మానవ వనరులను తీర్చిదిద్దేందుకు ఈ విద్యా సంస్కరణలు దోహదం చేస్తాయి. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ వెలువరించారు. కొత్త విధానంపై డిగ్రీలో చేరే విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నారు.

**నాలుగో ఏడాది డిగ్రీకి అనుమతి**

దేశంలోనే తొలిసారిగా నూతన జాతీయ విద్యావిధానం-2020 మేరకు విద్యా సంస్కరణలను మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్నారు. ఇప్పటికే నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మూడో ఏడాది డిగ్రీ విద్య పూర్తయింది. యూజీసీ ఫ్రేమ్ వర్క్స్ ప్రకారం యూజీ విద్యను రెండు విధాలుగా విభజించారు. మూడేళ్ల డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించిన వారు రీసెర్చ్ ఆనర్స్ డిగ్రీ కోర్సులో చేరవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పీజీ లేకుండా నేరుగా పీహెచ్‌డీ కోర్సుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. మూడేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైతే జనరల్ ఆనర్స్ కోర్సును అభ్యసించవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో రెండో ఏడాదిలో చేరవచ్చు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఆనర్స్ కోర్సులను అందించేందుకు నిబంధనలు విధించారు. మూడేళ్లలో వరుసగా 30 శాతం అడ్మిషన్లతో పాటు సంబంధిత కోర్సుల్లో ఇద్దరు డాక్టరేట్ కలిగిన ప్రొఫెసర్లు ఉంటేనే ఆనర్స్ కోర్సుల బోధనకు అనుమతి మంజూరు చేస్తారు.

**డిగ్రీ కోర్సుల్లో సమూల మార్పులు**



రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కోర్సుల్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచే సింగిల్ సబ్జెక్టు స్పెషల్ డిగ్రీ విధానం అమల్లోకి వచ్చింది. ఒక సబ్జెక్టుపై సమగ్రమైన అవగాహనతో పాటు, ఇతర సబ్జెక్టులపై కూడా పట్టు సాధించేలా నూతన విద్యా ప్రణాళికకు రూపకల్పన చేశారు. నూతన విద్యా విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఇప్పటికే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లను ఆదేశించాం.

– ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, రిజిస్ట్రార్, ఎస్కేయూ

# ఉనికి కోల్పోయిన స్వతంత్ర జర్నలిజం

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాలగౌడ



మాట్లాడుతున్న విశ్రాంత జడ్జి గోపాలగౌడ

**ప్రశాంతి నిలయం:** రాజకీయ జోక్యం కారణంగా స్వతంత్ర జర్నలిజం ఉనికి కోల్పోయిందని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాలగౌడ ఆందోళన వ్యక్తం చేశారు. మెజారిటీ మీడియా సంస్థలు ఏదో ఒక రాజకీయ పార్టీతోనో, భావజాలంతోనే పొత్తు పెట్టుకోవడమే ఇందుకు కారణమన్నారు. స్థానిక ఆర్‌వీ జానకీరామయ్య కల్యాణమంటపం వేదికగా కామ్రేడ్ మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాలగౌడ హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ప్రజాశక్తి పత్రిక ఎడిటర్ తులసీదాస్, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి తదితరులతో కలసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 'రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు – మీడియా పాత్ర' అంశంపై ప్రసంగించారు. ద్వేష పూరిత ప్రసంగాలు, మత విద్వేషాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయన్నారు. ఇలాంటి అరాచకాలను పరమత సహనం పాటించే మన దేశంలో ఆపడం సవాల్‌గా మారిందన్నారు. స్త్రీ సమానత్వ అంశాన్ని ఆర్టికల్ 14లో పొందుపరిచినప్పటికీ అన్ని రంగాల్లో సమానత్వం కల్పించడం రాజ్యాంగానికి అతి పెద్ద సవాలుగా మారిందన్నారు. జనాభాలో 50 శాతమున్న మహిళలకు పార్లమెంట్‌లో 25 శాతం సీట్లు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. దేశ వ్యాప్తంగా డజన్ల కొద్ది అనుభవజ్ఞులైన మహిళా న్యాయవాదులు, న్యాయమూర్తులున్నా.. సుప్రీం కోర్టులో మాత్రం కేవలం ముగ్గురు మాత్రమే న్యాయమూర్తులుగా ఉన్నారన్నారు.

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా జర్నలిస్టులు పనిచేస్తున్నారన్నారు. సమాజాభివృద్ధిలో వార్తా పత్రికలు కీలకంగా పనిచేస్తుండడాన్ని అభినందించారు. ఆదర్శ ప్రాయమైన జీవితాన్ని గడిపిన మోటూరు హనుమంతరావు, బొమ్మారెడ్డి నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి పాత్రికేయుడూ వారి అడుగు జాడల్లో నడవాలని ఆకాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను జర్నలిస్టులు కాపాడిన తీరును కొనియాడారు. అనంతరం మోటూరు హనుమంతరావు స్మారక అవార్డును హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయుడు తుమ్మలపల్లి ప్రసాద్‌కు అందజేసి, ఘనంగా సత్కరించారు. అలాగే బొమ్మరెడ్డి స్మారక అవార్డును బ్యూరో, స్టాపర్ కేటగిరిలో రాజమహేంద్రవరానికి చెందిన పాత్రికేయుడు బి.శ్రీనివాసాచారికి, మండల స్థాయి విలేకరుల కేటగిరిలో హిందూపురం, సింగరాయకొండకు చెందిన విలేకరులు షబ్బీర్, రవికుమార్‌కు అందజేశారు.

### ఉన్నఫళంగా కుప్పకూలి వ్యక్తి మృతి



మృతుడు గోపి

**అనంతపురం క్రైం:** స్థానిక శ్రీకంఠం సర్కిల్‌లో ఉన్నఫళంగా కుప్పకూలి ఓ వ్యక్తి మృతిచెందాడు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... మంగళవారం ఉదయం శ్రీకంఠం సర్కిల్‌లోని ఓ హోటల్ వద్ద టిఫిన్ చేస్తూ వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని సర్వజనాస్పత్రికి తరలించారు. కాగా, తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించి ఫొటోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో మృతుడి ఆచూకీ లభ్యమైంది. కర్ణాటకలోని పావగడ కుంబారపువీధికి చెందిన గోపి (42)గా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీసులకు అందుబాటులోకి వచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### పదోన్నతులపై దృష్టి పెట్టండి

**అనంతపురం సిటీ:** పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులపై దృష్టి పెట్టాలంటూ జెడ్పీ సీఈఓ కె.భాస్కర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు విన్నవించారు. ఈ మేరకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాబాఫక్రుద్దీన్, రమేష్‌బాబు మంగళవారం సీఈఓను కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఇటీవల కొందరు పరిపాలనాధికారుల(ఏఓలు)ను ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించి, పోస్టులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా ఎనిమిది ఏఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారితో ఆ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పొరుగు జిల్లాల్లో పోస్టులు ఖాళీ ఏర్పడినప్పుడల్లా అర్హులైన వారితో భర్తీ చేస్తున్నారని, దీంతో వారంతా జోనల్ స్థాయి సీనియారిటీలో ముందు వరుసలో ఉంటున్నారని గుర్తు చేశారు. దీనిపై సీఈఓ భాస్కరరెడ్డి సానుకూలంగా స్పందించారు. వారంలోపు ఏఓలకు పదోన్నతులు కల్పిస్తామని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

### నెలాఖరులోపు ఈ-కేవైసీ పూర్తి కావాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ.



వ్యవసాయాధికారులతో సమీక్షిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

**ఆత్మకూరు:** ఇప్పటి వరకూ ఈ-కేవైసీ చేయించని రైతులతో ఈ నెలాఖరులోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని వ్యవసాయాధికారులను డీఏఓ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. మంగళవారం ఆత్మకూరులోని రైతు భరోసా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులతో సమావేశమై మాట్లాడారు. మండల వ్యాప్తంగా 1,587 మంది రైతుల ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు తప్పనిసరిగా అందాలంటే ప్రతి రైతుతో ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. మట్టి పరీక్షలు, ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి వేరుశనగ పంపిణీపై ఆరా తీశారు. కౌలు రైతులకు హక్కు కార్డులు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత , వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### అందని మధ్యాహ్న భోజనం

**ఉరవకొండ:** మండలంలోని వై.రాంపురంలో పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. 8 రోజులుగా ఇంటి నుంచే ఆహారాన్ని తీసుకెళుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఈ పాఠశాలలో 3 నుంచి పదో తరగతి వరకూ 280 మంది విద్యార్థులున్నారు. వీరిలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యావసర సరుకులు, కోడిగుడ్లను ఓ గదిలో పెట్టి తాళం వేశారు. అయితే మెను ప్రకారం విద్యార్థులకు రోజూ భోజనం పెడుతున్నట్లు సీఆర్ యాప్‌లో నమోదు కావడం గమనార్హం. ఈ అంశంపై ఎంఈఓ ఈశ్వరప్ప మాట్లాడుతూ.. వై.రాంపురం పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహిస్తున్న వారు తమకు వద్దని పక్కకు తప్పుకున్నారన్నారు. కొత్త ఏజెన్సీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అయితే సీఆర్ యాప్‌లో భోజనం పెడుతున్నట్లుగా నమోదు చేసిన అంశం తన దృష్టి రాలేదన్నారు.

### 55,119 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లాలో మంగళవారం నాటికి 62,467 మంది రైతులకు 55,119 క్వింటాళ్ల విత్తన వేరుశనగ అందజేసినట్లు డీఏఓ యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బ్రహ్మసముద్రం, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం, కంబదూరు, కణేకల్లు, శెట్టూరు, కుందుర్పి, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, గుమ్మఘట్ట, నార్పల తదితర మండలాల్లో పంపిణీ ఎక్కువగా జరిగిందన్నారు. వేరుశనగతో పాటు 30 శాతం రాయితీతో కందులు, పెసలు, 50 శాతం రాయితీతో కొర్రలు, రాగులు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కొనసాగుతోందన్నారు. మినీకిట్ల రూపంలో కందులు, రాగులు, కొర్రలు ఇస్తున్నట్లు తెలిపారు.

# భ్రూణహత్యలకు అడ్డుకట్ట వేద్దాం

- అనంతపురం, బళ్లారి జిల్లాల వైద్యాధికారుల నిర్ణయం



బళ్లారిలో సమావేశమైన సరిహద్దు జిల్లాల వైద్యాధికారులు

**అనంతపురం క్రైం/బొమ్మనహాళ్:** ఆడపిల్లల నిష్పత్తిని పెంచేందుకు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అనంతపురం, బళ్లారి జిల్లాల వైద్యాధికారులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో భ్రూణహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు కలసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు సరిహద్దు ప్రాంతాల్లో జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం బళ్లారిలో అనంతపురం, బళ్లారి, తుమకూరు, చిత్రదుర్గ జిల్లాల వైద్యాధికారులు సమావేశమై చర్చించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ.. బళ్లారి, తుమకూరు, చిత్రదుర్గ జిల్లాల సరిహద్దులో ఉన్న అనంతపురం జిల్లాకు చెందిన కొన్ని మండలాల్లో లింగ నిష్పత్తి చాలా తక్కువగా ఉందన్నారు. శెట్టూరు, కుందుర్పి మండలాల్లో లింగ నిష్పత్తి మరీ తక్కువగా ఉందన్నారు. సరిహద్దుల్లోని గర్భిణులు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారన్న అనుమానాలున్నాయన్నారు. ఇలాంటి సమాచారం బదిలీ చేసుకోవడం ద్వారా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయవచ్చన్నారు. ఇందుకు బళ్లారి జిల్లా వైద్యాధికారి డాక్టర్ జనార్ధన్ సానుకూలంగా స్పందించారు. ఇరు జిల్లాల అధికారులు సమన్వయంతో ముందుకెళితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న స్కానింగ్ సెంటర్లను తరచూ తనిఖీ చేయడం, డెకాయ్ ఆపరేషన్లు చేపట్టడంతో పాటు ఆడబిడ్డల ప్రాధాన్యతపై అవగాహన సదస్సులు నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో డెమో ఉమాపతి, త్యాగరాజు, బళ్లారి కుటుంబ సంక్షేమ అధికారి పూర్ణిమ, తుమకూరు జిల్లా కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రేఖ, చిత్రదుర్గ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బళ్లారి జిల్లా కలెక్టర్ పవన్‌కుమార్ మాలపాటిని డాక్టర్ వీరబ్బాయి, డాక్టర్ యుగంధర్ తదితరులు కలసి సమావేశంలోని అంశాలను వివరించి, ఆ మేరకు సహకరించాలని కోరారు.

**విధుల్లో నిర్లక్ష్యం వీడండి**

**బొమ్మనహాళ్:** రోగులకు అందుబాటులో ఉండకుండా విధులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి హెచ్చరించారు. డీఐఓ యుగంధర్‌తో కలసి మంగళవారం బొమ్మనహాళ్ పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సమయానికి విధులకు హాజరు కావాలని, రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కిందిస్థాయి సిబ్బందిపై నోటి దురుసుతో వ్యవహరించడం తగదన్నారు. అనంతరం రికార్డులు, వార్డు గదులను పరిశీలించారు. నాడు-నేడు కార్యక్రమం కింద చేపట్టిన పనుల ప్రగతిపై ఆరా తీశారు. పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీలక్ష్మి, మల్లేశ్వరి, సూపర్‌వైజర్ యుగంధర్, యుడీసీ నీలకంఠనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఓటరు జాబితా సవరణకు వేళాయె

**అనంతపురం అర్బన్:** ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసింది. జాబితాలో చేర్పులు (కొత్త ఓటర్ల నమోదు), వివరాల్లో మార్పులు, ఓట్ల తొలగింపునకు అవకాశం కల్పించింది. సవరణలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం సూచించిన రెండు శనివారాలు, రెండు ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. ఇక ఈ ఏడాది జనవరి 5న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 19,39,163 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,67,841 మంది, మహిళా ఓటర్లు 9,71,098 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 224 మంది ఉన్నారు.

**సవరణ షెడ్యూల్ ఇలా...**

- ఓటర్ల జాబితా సవరణపై జూలై 20 వరకు ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలకు ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ ఇస్తారు.
- జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి జాబితా మేరకు ఓటర్ల వివరాలను పరిశీలిస్తారు.
- ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 29 వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, జాబితా సవరణకు సంబంధించిన పనులు చేపట్టారు.
- సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 16 వరకు ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ నిర్వహిస్తారు. 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ.
- ఓటరు జాబితా సవరణపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను అక్టోబరు 17 నుంచి నవంబరు 30 వరకు స్వీకరిస్తారు.
- డిసెంబరు 26 నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు పరిష్కరిస్తారు.
- 2024 జనవరి 1న ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తారు.
- 2024, జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారు.

### యువకుడి హత్య



హతుడు మారుతి

**రొద్దం:** వివాహేతర సంబంధం కారణంగా ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం ఎం.కొత్తపల్లికి చెందిన ఓ వివాహితతో అదే గ్రామానికి చెందిన టి.మారుతి (36) కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో మారుతి ఆమె ఇంటికి చేరుకుని తలుపు తట్టాడు. అప్పటికే లోపల ఉన్న హనుమంతు (మహిళకు కొడుకు వరుసవుతాడు) తలుపులు తీసి ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికాడు. అయినా మారుతి వినకుండా ఘర్షణ పడ్డాడు. దీంతో సహనం కోల్పోయిన హనుమంతు వెంటనే మారుతిపై దాడి చేసి రోడ్డుపై లాగి పడేశాడు. ఘటనతో మారుతి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ హుస్సేన్‌పీరా, సీఐ కరుణాకర్, ఎస్ఐ నాగస్వామి మంగళవారం ఉదయం ఆ గ్రామానికి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. హతుడి బంధువుల ఫిర్యాదు మేరకు హనుమంతు, మల్లేష్, నారాయణస్వామిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### యువకుడి బలవన్మరణం

**హిందూపురం అర్బన్:** వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. లేపాక్షి మండలం నాగేపల్లికి చెందిన భాస్కర్(30) మగ్గం పనితో జీవనం సాగించేవాడు. ఇటీవల పని లేకపోవడంతో కుటుంబపోషణ, ఇతర అవసరాలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులతో అప్పులు చేశాడు. కొంత కాలంగా అప్పు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు ఎక్కువవయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన భాస్కర్ హిందూపురంలోని హయగ్రీవ ఆలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తండ్రి వద్దకు చేరుకున్నాడు. మంగళవారం ఉదయం ఆలయం సమీపంలోనే ఉన్న ఇంటి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, భాస్కర్‌కు భార్య ఉంది. సంతానం లేరు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రెండో పట్టణ ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.


### బెటాలియన్ అభివృద్ధికి చర్యలు



డీఐజీకి స్వాగతం పలుకుతున్న కమాండెంట్

**బుక్కరాయసముద్రం:** జంతలూరువద్దనున్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఏపీఎస్పీ బెటాలియన్ డీఐజీ హెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన 14వ బెటాలియన్‌ను పరిశీలించారు. బెటాలియన్ కమాండెంట్ జగదీష్ పుష్ప గుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. డీఐజీ మాట్లాడుతూ బెటాలియన్‌ను మంచి వాతావరణంలో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ రమణమూర్తి, ఆర్ఐ నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, సీతారామారావు, రాజశేఖర్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

### నిషేధిత కలుపు మందు సీజ్



సీజ్ చేసిన మందును చూపుతున్న ఏడీఏ రవి, ఏఓ శశికళ

**అనంతపురం అగ్రికల్చర్:** పంటల్లో కలుపు నివారణకు వాడే 140 లీటర్ల గ్లైసిల్ (నిషేధిత మందు)ను ఏడీఏ ఎం.రవి స్వాధీనం చేసుకున్నారు. అందిన విశ్వసనీయ సమాచారం మేరకు అనంతపురం రూరల్ ఏఓ శశికళతో కలసి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆటోలో తరలిస్తున్న గ్లైసిల్‌ను గుర్తించి అడ్డుకున్నారు. రూ.1.04 లక్షల విలువ చేసే 140 లీటర్ల నిషేధిత మందును నార్పలకు తరలిస్తున్నట్లుగా ఆటోడ్రైవర్ తెలిపాడు. దీంతో వాహనంతో పాటు నిషేధిత మందును సీజ్ చేసి, మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు.

## క్లుప్తంగా

### కుష్టుపై గ్రామాల్లో సర్వే చేయండి



కుష్టు సర్వే శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ దయాకర్

**ఆత్మకూరు:** మండల వ్యాప్తంగా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు కుష్టుపై సర్వే నిర్వహించాలని వైద్యాధికారి దయాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కుష్టువ్యాధిపై సర్వేపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి వచ్చే నెల 16 వరకు గ్రామాల్లో కుష్టుపై సర్వే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, సీహెచ్ఓ చంద్రావతి, సూపర్‌వైజర్ రత్నమ్మ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### చెత్త సేకరణ పక్కాగా జరగాలి

**అనంతపురం క్రైం:** నగరంలోని వివిధ డివిజన్లలో చెత్త సేకరణ పక్కాగా జరిగేలా చూడాలని ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని మేయర్ వసీం ఆదేశించారు. మంగళవారం నగరంలోని 22వ డివిజన్‌లో పుష్‌కార్ట్ల ద్వారా జరుగుతున్న చెత్త సేకరణను మేయర్ పరిశీలించారు. ప్రతి గడపకూ వెళ్లి చెత్త సేకరించాలని పారిశుద్ధ్య సిబ్బందిని మేయర్ ఆదేశించారు. రోడ్డుపై చెత్త వేయడం ద్వారా కాలువల్లో పడితే బ్లాక్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంతో చెత్త నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలో 2 లక్షల వరకు వివిధ రకాల డస్‌బిన్లు అందించినట్లు తెలిపారు. గుత్తి రోడ్డులో ఏళ్ల తరబడి ఉన్న టన్నులకొద్దీ చెత్తను బయోమైనింగ్ పద్ధతితో చెత్త నిర్వహణ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. కార్పొరేటర్లు లీలావతి, అనిల్‌కుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 550 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా



ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌లో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ ఎం.రవి

**అనంతపురం అగ్రికల్చర్:** ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా మంగళవారం 550 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. స్మార్ట్ కెమికల్ కంపెనీ నుంచి రైల్వేవ్యాగన్ల ద్వారా జిల్లాకు చేరిన ఎరువులను రాప్తాడు ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌లో పరిశీలించారు. 10-26-26, 12-32-16, 24-24-0 రకం ఎన్-పీ-కే కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయన్నారు. కలెక్టర్, జేసీ, డీఏవో ఆదేశాల మేరకు ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌లు, హోల్‌సేల్, రీటైల్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

### గీతా పఠనంతో మానసిక ప్రశాంతత



భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

**అనంతపురం కల్చరల్:** భగవద్గీత సకల సమస్యలకు పరిష్కార మార్గమని, గీతా పఠనంతో ఎవరికైనా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి తరుపున మంగళవారం సాయంత్రం కల్యాణదుర్గం బైపాస్ రోడ్డు ఏరియాలో గీతా ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పరిచయం చేశారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక సభ్యులు ఫక్కీరప్ప, విజయక్క, నాగమణి, రేఖ, నాగిరెడ్డి, భాస్కర రెడ్డి, రాఘవ పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ భాగ్యమ్మ

**కనగానపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు.మంగళవారం మండలంలోని తూంచర్లలో ఆమె స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. దీంతో పాటు విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రంగారెడ్డి, స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధ్యానం.. ఆరోగ్య యోగం

**సందర్భం:-**

**నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం**



ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి సాహిత్య, జిల్లా అధికారులు





యోగా ర్యాలీలో పాల్గొన్న బ్రహ్మకుమారీలు, ఎన్‌సీసీ విద్యార్థులు

**అనంతపురం కల్చరల్:** మనిషి జీవితం యాంత్రికమయ్యింది..ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవనం ఉరుకుల పరుగుల మధ్య సాగుతోంది.. ప్రతి ఒక్కరిలోనూ వృత్తి, వ్యక్తిగత ఒత్తిళ్లు అధికమయ్యాయి. కాలుష్యం వల్ల అనేక రుగ్మతలతో బాధపడాల్సి వస్తోంది.. వీటన్నింటికీ కాస్త ఉపశమనం పొందాలంటే యోగానే సరైన సాధనం.. తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఈ ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 21న 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా జరుపుకోవాలని నిశ్చయించాయి.

**అనంతలో ఉచిత శిక్షణ కేంద్రాలు :**

యోగా ఆరోగ్యానికి దివ్య ఔషధంగా ఉంటుంది. ఒత్తిడి దూరమవుతుంది. అందుకనుగుణంగా వివేకానంద యోగా కేంద్రం, ఆయుష్ శాఖతో పాటు యువజన సంక్షేమశాఖ, పోలీసుశాఖ, నేషనల్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, బ్రహ్మకుమారీలు, పతంజలి యోగా కేంద్రం, శ్రీరామచంద్ర హార్ట్‌ఫుల్ మెడిటేషన్, పిరమిడ్ ధ్యానకేంద్రం, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సత్యసాయి ధ్యానమండలి తదితర సంస్థలు సేవాభావంతో అనేక ఏళ్లుగా యోగా శిక్షణ ఇస్తున్నాయి. వారందరూ సమన్వయంతో ఈసారి యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో యోగా గురువులు ప్రజలందరితో పెద్ద ఎత్తున యోగాభ్యాసనాలను చేయిస్తారు. జిల్లా ఉన్నతాధికారులతో పాటు ప్రజా ప్రతినిధులందరూ హాజరై ప్రజలకు యోగా ప్రాధాన్యతను తెలియజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

### ఒత్తిడికి యోగానే దివ్య ఔషధం ...

యోగాతో ప్రధానంగా మానసిక శారీరక ఒత్తిడి తగ్గుతుంది. బీపీ , షుగర్ నియంత్రణలో ధ్యానం యోగా తిరుగులేని ఉపశమనం ఇస్తుంది. యోగాతో ఎలాంటి సవాళ్లయినా ఎదుర్కోవచ్చని శాస్త్రీయంగా నిరూపితమైంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని వారం రోజులుగా రిజర్వ్ పోలీసులకు ప్రత్యేకంగా పరేడ్ గ్రౌండ్స్‌లో యోగా నేర్పిస్తున్నాం. ఈసారి నెహ్రూ యువకేంద్రం, పతంజలి సంయుక్తంగా స్థానిక కేఎస్ఆర్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

– మహేష్‌బాబు, పతంజలి యోగా గురువు

### ఎన్నో సమస్యలకు పరిష్కారమార్గం

ఎలాంటి సమస్యకైనా చక్కటి పరిష్కారం చూపించే యోగాను వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో సేవాభావంతో నేర్పిస్తున్నాం. పెద్ద నగరాల్లో రూ.వేలు వెచ్చించి నేర్చుకునే అనేక యోగా క్రియలు జిల్లా వ్యాప్తంగా ఉచితంగా నేర్పిస్తున్నాం. వ్యాధి నిరోధక శక్తిని పెంచే యోగా ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరం.

– మెళవాయి రాజశేఖరరెడ్డి, వివేకానంద యోగా కేంద్రం

### యోగాతో ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం

- యోగా అవగాహన ర్యాలీలో మేయర్ వసీం

**అనంతపురం కల్చరల్:** యోగాతో ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దామని మేయర్ వసీం సలీం అన్నారు. మంగళవారం ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజుల పాటు సాగే వేడుకల్లో చైతన్యం వతం చేస్తూ, అవగాహన కల్పిస్తూ పలువురు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీ చేశారు. స్థానిక ఆర్ట్స్ కాలేజ్ వద్ద ప్రారంభమైన ర్యాలీని మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, డీఎస్పీ హనుమంతు, ఆన్‌సెట్ సీఈవో కేశవ నాయుడు, జిల్లా టూరిజంశాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, వివేకానంద యోగా కేంద్రం, అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి ఆయుష్ జిల్లా అధికారులు డాక్టర్ తిరుపతి నాయుడు, డాక్టర్ రామకుమార్, బ్రహ్మకుమారి సంస్థ సిస్టర్ శారద మాట్లాడారు. యోగా అవగాహన పెంచడానికి ఏటా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం ఉదయం 6.30 గంటలకు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతుందని, కలెక్టర్, ఎస్పీలతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. అనంతరం పురవీధుల్లో ప్లకార్డులు పట్టుకొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. ర్యాలీలో యోగా గురువులు కృష్ణవేణి, దివాకర్, మారుతీప్రసాద్, ఆంజనేయులు, సుధాకర్, అబ్బా టీవీ డాక్టర్ హరిప్రసాద్, కవులు రియాజుద్దీన్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

### అనధికార నిర్మాణాలను ఉపేక్షించేదిలేదు



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి

**అనంతపురం క్రైం:** అనధికార నిర్మాణాలను ప్రోత్సహిస్తే సస్పెండ్ చేస్తానని కమిషనర్ రమణారెడ్డి పట్టణ ప్రణాళిక కార్యదర్శులను హెచ్చరించారు. మంగళవారం నగరపాలక సంస్థలో పట్టణ ప్రణాళిక కార్యదర్శులతో కమిషనర్ సమావేశమయ్యారు. వివిధ సచివాలయాల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలు, వాటి అనుమతులపై కమిషనర్ ఆరా తీశారు. పాత బీపీఎస్ ఫైళ్లను నివృత్తి చేయాలన్నారు. అనంతరం కమిషనర్ నగరంలోని ఝాన్సీ లక్ష్మీబాయి పాఠశాలలో జరుగుతున్న పనులను కమిషనర్ పరిశీలించారు. నాడు-నేడు పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లను ఆదేశించారు. పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో ఏసీపీ బాలాజీ, టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి పాల్గొన్నారు.

### వైఎస్సార్ క్రీడా పాఠశాల ప్రవేశ ఎంపికలు

**రాప్తాడు:** మండల స్థాయి డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల 4, 5 తరగతి ప్రవేశాలకు ఎంపికలు రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 22న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ సాల్మన్, ఎంఈఓ మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకొని 22న రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు రాప్తాడు ఉన్నత పాఠశాల పీడీలు కేశవమూర్తి, రాజశేఖర్ రెడ్డిలను సెల్: 8099404427లో సంప్రదించాలన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**చెన్నేకొత్తపల్లి:** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మేడాపురంలో రూ.2.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ మోటార్లకు లోఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు నియోజకవర్గంలోని మేడాపుర, కుంటిమద్ది గ్రామాల్లో ప్రభుత్వ నూతన సబ్ స్టేషన్‌ను మంజూరు చేసిందన్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో మేడాపురం గ్రామ రైతుల కోసం చేపట్టిన పాదయాత్రలో సబ్ స్టేషన్ నిర్మిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని ఆయన గుర్తు చేశారు.

**వాళ్లు రక్తం పారిస్తే నేను నీళ్లు పారిస్తున్నా..**

25 ఏళ్లుగా రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాల్లో పరిటాల కుటుంబం రక్తం పారిస్తే, నేను నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ నీళ్లు అందిస్తున్నానని, దశాబ్దాల కాలం నుంచి వట్టిపోయిన పేరూరు డ్యాంకు నీరు అందించడమే కాకుండా రామగిరి బంగారు గనులు తెరిపిస్తున్నానన్నారు. మహిళా పాడి రైతులకు అండగా నిలిచేందుకు తోపుదుర్తి సహకార 'అమ్మ డెయిరీ'ని తన సొంత నిధులను రూ.20 కోట్లతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. ప్రజాసమస్యలపై తాను పరిష్కరిస్తుంటే తమ ఉనికిని కోల్పోతామనే ప్రతిపక్షాలు తనపై అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయ్య, విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ ఏడీఈ శ్రీకాంతరెడ్డి, ఏడీఈలు కిరణ్‌కుమార్ మోహనమ్మ, మండల ఇన్‌చార్జ్ ఏఈ మదన్‌మోహన్, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ గంగావతి పాల్గొన్నారు.

# చిత్తశుద్ధి ఉన్న సీఎం వైఎస్ జగన్

**రాప్తాడురూరల్:** చిత్తశుద్ధి ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్‌లో రెండోరోజూ 'గడప గడపకూ మన ప్రభుత్వం' చేపట్టారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటా తిరిగారు. పరిటాల సునీత మంత్రిగా ఉండగా నియోజకవర్గ వ్యాప్తంగా 1,200 ఇళ్లు మంజూరు చేస్తే, తాము 26 వేల ఇళ్లు ఇచ్చినట్లు తెలిపారు.

**పీఏబీఆర్ నీటిని అందిస్తాం.. :**

పాపంపేట, విద్యారణ్యనగర్, కక్కలపల్లికాలనీ పంచాయతీ, అక్కంపల్లి, కురుగుంట, రాచానపల్లి, కొడిమి తదితర పంచాయతీలకు పీఏబీఆర్ నీటిని త్వరలోనే తీసుకొస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి నిధులు కూడా మంజూరు చేశారన్నారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని మేలును జగనన్న చేస్తున్నారన్నారు. అలాంటి ముఖ్యమంత్రిని మరోమారు దీవించాలని కోరారు. పలువురికి



లబ్ధి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఎమ్మెల్యే ఆర్థికసాయం చేశారు. ఎంపీపీ గుజ్జల వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు ధనుంజయయాదవ్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓబుగారి హరినాథరెడ్డి, మండల కన్వీనర్ మఠం శ్యాంసుందర్, మండల కన్వీనర్ గోవింద రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, మౌనిక, నాయకులు మాదన్నయాదవ్, టి.గోపాల్‌రెడ్డి, మునిశంకరయ్య, అపర్ణ, ఎర్రిస్వామి, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

### తల్లీబిడ్డలకు అదనపు పడకలు

**అనంతపురం క్రైం:** తల్లీ, బిడ్డలకు అదనపు పడకలు ఏర్పాటు చేసేలా సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ చర్యలు చేపట్టారు. ఇటీవల చిన్నపిల్లల వార్డు, ఎస్ఎన్‌సీయూను సూపరింటెండెంట్ పరిశీలించారు. ఎస్ఎన్‌సీయూలో అడ్మిషన్‌లో పసిపిల్లలను ఉంచుతారు. వారి తల్లులకు ప్రత్యేక పడకల ఆవశ్యకత అవసరమని భావించి సూపరింటెండెంట్ అదనపు పడకలు కేటాయించాలని సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అదనపు పడకలు ఏర్పాటు చేశారు.

# బోనాల షహజీర్‌కు పీహెచ్‌డీ ప్రదానం

**అనంతపురం క్రైం:** ప్రభుత్వ వైద్య కళాశాలలోని అనాటమీ విభాగంలో ట్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బోనాల షహజీర్ పీహెచ్‌డీ డాక్టరేట్ పొందారు. చెన్నైలోని సవీత యూనివర్సిటీలో బోనాల షహజీర్ ఎవాల్యుయేషన్ ఆఫ్ యాంటీ డయాబెటిక్ యాక్టివిటీ ఆఫ్ ఎకేంతిస్ ఎస్పిరా ఇన్ హై ఫ్యాట్ డైట్ అండ్ స్ట్రెప్టోజోటోసిన్ ఇన్‌డ్యూస్డ్ డయాబెటిక్స్ రాట్స్ అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ గుణప్రియ రఘునాథ్ మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీ పరిశోధన చేశారు. మంగళవారం జరిగిన పబ్లిక్ వైవాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎగ్జామినర్లు షహజీర్‌కు డాక్టరేట్‌ను ప్రకటించారు. బోనాల షహజీర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, అనాటమీ ప్రొఫెసర్ ఉమామహేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు అభినందించారు.



బోనాల షహజీర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న చెన్నై, సవీత యూనివర్సిటీ ప్రొఫెసర్లు

### జగనన్న ఆణిముత్యాలకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి

**అనంతపురం క్రైం:** నగరంలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు ప్రతిభాపురస్కారాలను డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి మంగళవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను సత్కరించేందుకు జగనన్న ఆణిముత్యాల పేరిట కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం వారు విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ధర్మపురి వెంకటేష్, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ ఎన్.రాజేశ్వరి, సభ్యులు సాంబశివ, ఉపాధ్యాయులు రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పశుబీమా సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న అనంతపురం డివిజనల్ పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్‌రెడ్డి

**రాప్తాడు:** వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు అనంతపురం డివిజినల్ పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బీమా చేయించిన పశువులు మృత్యువాత పడితే రైతు నష్టపోకుండా పరిహారం అందుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, పాడి రైతులు, బియ్యం కార్డు కలిగిన రైతులు లబ్ధిదారు వాటా కింద మూడేళ్ల కాల వ్యవధికి గాను రూ.384 ప్రీమియం చెల్లిస్తే రూ.30 వేలు, నాటీ పశువులకు రూ.192 ప్రీమియం చెల్లిస్తే రూ.15 వేలు పరిహారం వర్తిస్తుందన్నారు. ఒక్కో గొర్రె లేదా మేకకు ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 చొప్పున ప్రీమియం చెల్లిస్తే రూ.6 వేలు బీమా వర్తిస్తుందన్నారు. పథకం లబ్ధి కోసం సంబంధిత ఆర్‌బీకే కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రకాష్, ఎంపీడీఓ సాల్మన్, పశువైద్యాధికారులు దిలీప్ కుమార్, తులసీరామ్, తేజస్విని, సోమేశ్వరి, గోపాల మిత్రలు, రైతులు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 1 నుంచి 'జగనన్న సురక్ష'

**చెన్నేకొత్తపల్లి:** మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెల 1 నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ గంగావతి తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లు, సిబ్బంది, మండల స్థాయి టీం సభ్యులు రెండు బృందాలుగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ పత్రం, మ్యుటేషన్, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ మొబైల్ నంబర్ అప్‌డేషన్, కౌలు రైతు కార్డు, రైస్ కార్డు మంజూరు సేవలు ఉంటాయన్నారు. జూలై 1న కనుముక్కల-1 సచివాలయం, 4న గంగినేపల్లి, 6న కనుముక్కల-2 సచివాలయం, 7న మేడాపురం -1 సచివాలయం, 11న మేడాపురం-2, 13న వెంకటంపల్లి, 15న ప్యాదింటి, 18న నాగసముద్రం, 20న చెన్నేకొత్తపల్లి-1 సచివాలయం, 22న న్యామద్దల-2, 28న ముష్టికోవెల సచివాలయ పరిధిలోని గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు.

# డీఈఓ కార్యాలయం ముట్టడి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

**రాప్తాడురూరల్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిబంధనలు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు మంగళవారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఏబీవీపీ జాతీయ కార్యదర్శి నాగోతు హరికృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తూ పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నాయన్నారు. ఒక పాఠశాలకు గుర్తింపు తీసుకొని కేర్, కాన్సెప్ట్, జనరల్, సీ-బ్యాచ్, సీబీఎస్ఈ, ఐఐటీ తదితర పేర్లతో నడుపుతున్నాయన్నారు. అనంతరం డీఈఓ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్‌కుమార్‌రెడ్డి, చిన్నా శ్రీరామ్, రాష్ట్ర కార్య సమితి సభ్యులు చెన్నయ్య, నగర కార్యదర్శి శివతేజ, నాయకులు కమలాకర్, సుధీర్, భరత్, బాబు, పునీత్, తిలక్ అరవింద్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జామియా మసీదు ఈఓ పదవీ కాలం పొడిగింపు

**అనంతపురం సిటీ:** అనంతపురంలోని జామియా మసీదు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)గా నియమితులైన ఏపీ ట్రాన్స్‌కో విశ్రాంత సూపరింటెండెంట్ ఎ.మహమ్మద్ హుస్సేన్ పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించారు. ఈ మేరకు ఏపీ స్టేట్ వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఎఫ్ఏసీ) ఎల్.అబ్దుల్ ఖాదిర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురానికి చెందిన కేఎం షఫీవుల్లా, ఆయన తనయుడు కేఎం షకీల్ షఫీ ఇద్దరూ కలిసి నలభై ఏళ్లుగా ఎలాంటి హక్కు లేకున్నా ముతవల్లిగా కొనసాగుతూ వక్ఫ్ ఆదాయాన్ని, ఆస్తులను తమ స్వార్థానికి ఉపయోగించుకోవడంపై ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం వారిని సస్పెండ్ చేస్తూ గతంలో ఉత్తర్వులు వెలువరించింది. జామియా మసీదుకు మహమ్మద్ హుస్సేన్‌ను ఈఓగా నియమిస్తూ ఆదేశించింది. గడువు తీరడంతో మరో ఆరు నెలల పాటు ఈఓ పదవీ కాలాన్ని ఈ ఏడాది డిసెంబర్ 26 వరకు పొడిగిస్తూ తాజాగా మరో ఉత్తర్వు జారీ అయ్యింది. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు జామియా మసీదు నిర్వాహకులు, మత పెద్దలు, ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలి

**అనంతపురం అర్బన్:** పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం ఉపసంహరించాలని సీపీఎం ఒకటో నగర కమిటీ ఆధ్వర్యంలో నీలిమ సర్కిల్ వద్ద నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. 50వ డివిజన్ పరిధిలో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలకు భారం మోపడం సరికాదన్నారు. విద్యుత్ చార్జీలు భారంగా మారితే చిన్న పరిశ్రమలు, చేతివృత్తి పనులు మూతపడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వలి, మసూద్, ప్రకాశ్, గఫూర్, శీనా, సురేశ్, నరసింహారెడ్డి, ఫకృద్దీన్, ఫరీదా, నాగయ్య పాల్గొన్నారు.

### అనాథ మహిళలకు 'పుట్టినిల్లు'

**అనంతపురం కల్చరల్:** అనాథ మహిళలకు 'పుట్టినిల్లు' అని ఆశ్రమ నిర్వాహకురాలు డాక్టర్ నిర్మల మురళి అన్నారు. 'పుట్టినిల్లు' ఆశ్రమం ప్రథమ వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ఉదయం కలెక్టరేట్ సమీపంలోని ఇస్కాన్ గోశాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆస్పత్రుల వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల మాట్లాడుతూ ఒంటరి మహిళలు సమాజంలో ఇబ్బందులకు గురికాకుండా పుట్టినిల్లు ఆశ్రమంలో ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు ఉపాధి పనులు నేర్చుకోవచ్చన్నారు.